
# సమ్మె

పి. లక్ష్మి




సాయంత్రము ఐదుగంటలయింది. రావు అప్పుడే ఆఫీసునుండి ఇంటికి వచ్చాడు ఇల్లంతా నిశ్శబ్దంగా ఉండటం చూసి ఆశ్చర్యపోయాడు. "శారదా! శారదా!" అంటూ భార్యామణిని పిలిచి పడకుర్చీలో కూలబడ్డాడు - అలసటగా. పావుగంట గడిచినా ఎవరూ రాకపోయేసరికి రావుకి చిర్రెత్తుకొచ్చింది. "ఎవరూ పలకరేమర్రా! ఎక్కడ చచ్చారు!" అంటూ కేకలు వేశాడు. పావుగంట గడిచేసరికి పెద్దకూతురు రోజా కాఫీగ్లాసుతో వచ్చింది. గ్లాసందుకుంటూ "అమ్మేది?" అన్నాడు. రోజా మాట్లాడకుండా వెళ్ళిపోయింది. రావుకి వీళ్ళ ధోరణి అర్థం కాలేదు. కాఫీ త్రాగుతూ ఆలోచించాడు. వీళ్ళు ఇలా ఉండటానికి కారణం యేమిటా అని. ఎంత ఆలోచించినా కారణం తెలియలేదు. రోజూ అతడు ఆఫీసునుండి వచ్చేసరికి శారద కాఫీ గ్లాసుతోనూ, రోజా మంచినీళ్ళగ్లాసుతోను వచ్చేవారు. పెద్దకొడుకు క్రికెట్ ఆడడానికి వెళుతూ తండ్రిని పలకరించి వెళ్ళేవాడు. బాబు, అమ్మలు తండ్రికిరువక్కలా చేరి ఆ రోజు స్కూల్లో వాళ్ళు నేర్చుకున్న పాఠాలు, చేసిన అల్లరి గురించి పోటీపడి చెప్పేవారు. అలాంటిది ఈ రోజు ఒక్కరూ రాకపోయేసరికి రావుకి అసలు కారణం ఏమిటో అంతుపట్టలేదు. రావు తోచకుండా దిక్కులు చూస్తున్నాడు. మధు లోపలి గదిలోంచి విసురుగా వచ్చి వీధిలోకి వెళ్ళిపోయాడు. శారద, రోజా ఉన్న అలికిడేలేదు. బాబు, అమ్మలు వరండాలో గొడవచేయకుండా కూర్చొని బొమ్మల పుస్తకాలు చూస్తున్నారు. "వీళ్ళందరూ దెబ్బలాడుకోలేదు కదా!" అనుకున్నాడు. "బాబూ ఇలా రా!" అనిపిలిచాడు, అసలు సంగతి వాడేమైనా చెపుతాడేమోనని. వాడు కోపంగా తలెత్తి తండ్రిని చూసి, చేతిలో పుస్తకం పడేసి తుర్రుమన్నాడు రావుకి మతిపోయింది వాడి ధోరణి చూస్తే, రోజూ బ్రతిమాలినా వదలక మీదపడి తొక్కే వీళ్ళేనా ఇలా ఉంది! ఇక లాభం లేదనుకొని లేచి అమ్మలు దగ్గరకు వెళ్ళి, దాన్ని ఎత్తుకుని "ఇవాళ ఇంట్లో ఏమైందే అమ్మలూ?" బుజ్జగిస్తూ అడిగాడు. అమ్మలు తండ్రి చేతుల్లోంచి తప్పించుకుందామని చూసింది. "కారణం చెబితే వదుల్తాను" అన్నాడు రావు. అమ్మలు మెల్ల మెల్లగా అసలు విషయం చెప్పింది. రావు ఒక్కసారి గొల్లుమని నవ్వాడు. అమ్మలు మెల్లగా అక్కడనుంచి జారుకుంది. రావు నవ్వుకుంటూ కుర్చీలో కూర్చున్నాడు. అసలు విషయం యేమిటంటె మూడేళ్ళ క్రితం రావు మంచి మూడ్‌లో ఉండగా శారద మైసూరు, బెంగుళూరు వెళదామని అడిగింది. రావు వెంటనే ఒప్పుకొని సమ్మర్ హాలిడేస్‌లో వెళదామన్నాడు. కాని 3 యేండ్లనుండి రావు బద్ధకిస్తూనే ఉన్నాడు. నెక్స్ట్ యియర్, నెక్స్ట్ యియర్ అని కాలక్షేపం చేస్తున్నాడు. ఈ సంవత్సరం ఎలాగైనా వెళ్ళాలని పంతం పట్టింది శారద. జనవరినుండీ పోరుతూనే ఉంది మేలో సెలవు పెట్టమని. రావు విని విననట్టు ఊరుకున్నాడు. దాంతో శారదకి చిర్రెత్తి పిల్లల్ని ప్రోత్సహించి సమ్మె చేస్తోంది. అమ్మలు చెప్పిందేమిటంటె నేటినుంచీ

# సమ్మె

రావు బెంగుళూరు తీసుకువెళతా ననేవరకూ ఇంట్లో అందరూ నిరవధికంగా సమ్మెచేస్తారు. సమ్మెలో మొదటి భాగమే రావుతో మాట్లాడక పోవడం.

"సరే! మీ పని ఇలాగఉందా?" అనుకుని ఆ రోజు పేపరు తీసుకుని చదివాడు స్నానం చేసి. బట్టలు మార్చుకుని వార్తను విన్నాడు ఎంతకీ ఎవరూ పలకరించక పోయేసరికి వీళ్ళ వంతమేమిటో చూద్దామనుకున్నాడు. 8 గంటలకు వంటింట్లోంచి భోజనానికి పిలుపువచ్చింది. రావు మౌనంగా భోజనంచేసి వచ్చి పడుకున్నాడు. రావు వచ్చేశాక వంటింట్లోంచి గుసగుసలు వినిపించాయి. నవ్వుకుంటూ కాసేపు పుస్తకాలు తిరగేసి పడుకున్నాడు శారద ఆ రోజు పిల్లలతో హాలులోనే పడుకుంది. మొదటిరోజు సమ్మె అలాగ ప్రశాంతంగా జరిగింది

మర్నాడు రావు లేచేసరికి పిల్లలు హాల్లో సుదీర్ఘంగా ఆలపిస్తున్నారు. రావు గంభీరంగా ముఖం పెట్టి తనపని తనుచేసుకొని ఆఫీసుకు వెళ్ళిపోయాడు. ఇక్కడ రావుగురించి కొంత చెప్పాలి రావుకి నలుగురు పిల్లలు పెద్దవాడు మధు PUC పరీక్షలు వ్రాశాడు. పెద్దమ్మాయి రోజా ఫోరు ఫారం. తరువాతివాడు బాబు ఫస్టు ఫారం. అమ్మలు 3వ క్లాసు చదువుతున్నారు. భార్య శారద అనుకూలవతి. చీకూ, చింతా లేని సంసారం రావు ఖుషీగా సంసారాన్ని ఈదిపారేస్తున్నాడు. అనుకోకుండా వచ్చిన ఈ అవాంతరాన్ని రావు గట్టిగానే ఎదుర్కొన తలచాడు. ఆ రోజు సాయంత్రం రావు వచ్చేసరికి రోజా కాఫీకూడా తీసుకురాలేదు. వాళ్ళంతా సహాయనిరాకరణ ఉద్యమం చేశారు మూడవరోజు సెకండ్ సాటర్డే అవటం వలన రావు విధిగా ఇంట్లో ఉండవలసి వచ్చింది ఆ రోజు సమ్మె ఉధృతంగా ఉంది కాని రావు తనపని చేసుకొని కూర్చున్నాడు. శారద ఇంట్లో వంటచేయలేదు. పిల్లలు హోటల్ నుండి కారియర్ తెచ్చుకొని తిన్నారు. రావుకూడా హోటల్‌కు వెళ్ళి తిని వచ్చాడు. మధ్యాహ్నం లేచేసరికి సమ్మె మరింత ఉధృతంగా ఉంది. "మా కోర్కెలు తీర్చాలి. నాన్న డౌన్, నాన్నడౌన్ "అని పిల్లలు అరుస్తున్నారు. రావు కోపంగా హాల్లోకి వెళ్ళాడు. రావుని చూసి వాళ్ళు మరింతగారెచ్చిపోయారు. మధు ఆ రోజు పేపరు చింపేశాడు. రోజా మూలనున్న పత్రికలుతీసి విసిరేసింది. బాబు ఇంకుబాటిల్ తీసి నేల నేసి కొట్టాడు, అమ్మలు అద్దాన్ని గోడకేసి కొట్టింది. "సమ్మర్ టూర్" అని మధు అంటూంటే మిగతా వాళ్ళు "కావాలి" అంటూ అరుస్తున్నారు. పళ్ళు పట పటా కొరుక్కుంటూ చొక్కా వేసికొని రావు ఫ్రెండ్ ఇంటికి వెళ్ళి, అక్కడ నుండి సినిమాకు వెళ్ళి, హోటలులో భోజనం చేసి రాత్రి 10 గంటలకు యిల్లుచేరాడు. అప్పటికి పిల్లలందరూ పడుకున్నారు. రావు మౌనంగా ప్రక్కమీద వాలాడు. శారద తెల్ల చీర కట్టుకొని, మల్లెపూవులు పెట్టుకొని వచ్చింది గదిలోనికి. రోగం కుదిరింది అనుకున్నాడు. శారద మెల్లగా పక్కలోకి చేరి సంధి మార్గానికి వచ్చింది, రావు గంభీరంగా ముఖం పెట్టి సిగరెట్టు కాలుస్తూ పడుకున్నాడు. శారద మెల్లగా బ్రతిమాలుతూ మే నెలలో ఇక 15 రోజులే ఉంది కాబట్టి మద్రాసు మాత్రం వెళ్ళి వద్దామని అడిగింది. రావు విననట్టు మరో వేపుకి తిరిగి పడుకున్నాడు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా సంధి చేసుకోవడం మంచిదని, లేక పోతే తీవ్ర పరిణామాల్ని ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించింది శారద. రావు "I don't care" అని ముసుగుపెట్టి పడుకున్నాడు తోకతొక్కిన పాములా లేచి విసురుగా హాల్లోకి వెళ్ళిపోయింది.

ఆ మరుసటి ఆదివారం కావడంతో రావు ఇంట్లోనే ఉన్నాడు. రావు ఎక్కడికీ వెళ్ళకుండా. మధు రావు సైకిల్ దాచేశాడు. రేడియో వినకుండా రోజా రేడియో దాచేసింది. బాబు అమ్మలు ఆ రోజు పేపరు, పుస్తకాలు దాచేశారు. రావు తీరిగ్గా సిగరెట్టు కాల్చుకుంటూ కూనిరాగాలు తీస్తూ మంచంమీద పడుకున్నాడు. ఆ రోజుకూడ రావుకి హోటల్‌కూడే గతి అయ్యింది. కిళ్ళీ వేసుకొని ఇంటికొచ్చాడు రావు. అమ్మలు ఎదురుగా వచ్చి "అమ్మ నిరాహారదీక్ష చేస్తోంది" అని నోటీసిచ్చి వెళ్ళిపోయింది. రావు నవ్వుకుంటూ తన గదిలోకివెళ్తూ హాల్లో నీరసంగా కుర్చీలో కూర్చున్న శారదను చూశాడు. రావు మనసు కలుక్కుమంది. కాని సర్దుకుని తన గదిలోకి వెళ్ళిపోయాడు. పిల్లలు శారద ఎదురుగా కూర్చుని నినాదాలు చేస్తున్నారు. రావు గది తలుపులు వేసికొని కూర్చున్నాడు. కాని హాల్లో వార్తంతా గమనిస్తూనే ఉన్నాడు. 3 గంటలకి మధు ఇడ్లీలు తెచ్చి శారదని బ్రతిమాలుతూ తినిపించాడు. "నాన్నకి చెప్పద్దు" అని శారద తినేసింది. 5 గంటలకు రావు స్నానంచేసి, షికారుకని బయలుదేరాడు. కాని పిల్లలు ఘెరావ్ చేసి రావుని కదలనీయలేదు. రావు కింకా చిరాకుగా ఉంది. ఎప్పుడూ సరదాగా ఉండే శారదా, పిల్లలు మాట్లాడటంలేదు ఏమిటో పిచ్చెక్కినట్లుంది. అదీకాక యివాళ పొద్దున్నుంచి ఎక్కడికీ కదల లేదేమో రావుకోపం ఆకాశాన్నంటుకుంది. ఇక లాభం లేదనుకొని ఒక్కసారి విజృంభించాడు పిల్లల్ని తోసుకుంటూ శారదకి ఎదురుగా వెళ్ళి నుంచున్నాడు. కళ్ళలోంచి నిప్పులు కురిపిస్తూ శారదని, పిల్లల్ని చూశాడు. దాంతో వాళ్ళు తారెత్తిపోయి భయం భయంగా నిలబడ్డారు. రావు గిర్రున తిరిగి హాలు దాటబోయాడు. బాబు అమ్మలు రావుకాళ్ళు రెండూ పట్టుకున్నారు. రావు వాళ్ళిద్దరికి రెండు తగల్నిచ్చి శారదకు గట్టిగా వార్నింగిచ్చాడు. "శారదా! నేను 8 గంటలకి యింటికి వచ్చేసరికి వంట సిద్ధంగా ఉండాలి. లేదా రేపే మీ పుట్టింటికి దయచేయవచ్చు. నేను ఎంత సహనంగా ఉన్నా, మీరు మీ స్ట్రైక్ మానలేదు. మీకు దీనికి తగిన శిక్ష వేయవలసిందే. మిమ్మల్ని జన్మలో బెంగుళూరు తీసుకువెళ్ళను. మధూ నువ్వు పేపరు చింపేశావు. ఇంక పేపరు కొనను. నేను ఆఫీసులో ఎలాగూ పేపరు చూస్తాను. రేపు రిజల్ట్సు వచ్చినపుడు, ఆ పైన కాలేజీలకు అప్లై చేయవలసి నపుడు నువ్వే బాధ పడతావు రోజా! ఈ రోజునుండి వీక్లీస్ కొనను. ఇంకు బాటిల్, అద్దం పగలకొట్టారు. కాబట్టి బాబు, అమ్మలు పాకెట్టుమనీ ఈ నెల కట్. మీ అమ్మ నెయ్యి ఒలకపోసింది. అందుకని నెలాఖరు వరకు నెయ్యిలేని అన్నమే మీకు గతి. ఇంకా పిచ్చివేషాలు వేశారంటే మిమ్మల్ని స్కూలుకు కూడ పంపను. బాగా ఆలోచించుకుని రాత్రి నే వచ్చేసరికి భోజనానికి రెడీగా ఉండండి. లేదా మీ యిష్టం" అని విసురుగా వెళ్ళిపోయాడు.

రాత్రి భోజనానికి వచ్చేసరికి రావుకి శారద, పిల్లలు గుమ్మంలోనే స్వాగతం చెప్పారు. రోజా కాళ్ళు కడుక్కుందుకు నీళ్ళిచ్చింది. మధు తువ్వాలు అందించాడు. బాబు పీటవేస్తే అమ్మలు కంచం పెట్టింది. శారద అన్నం వడ్డిస్తే తిని, రావు దిగ్విజయోత్సవంతో పడగ్గదిలోకి వెళ్ళి పడుకున్నాడు. సమ్మెకారులంతా భయం భయంగా హాల్లో కిక్కురుమనకుండా పడుకున్నారు. మూడు రోజుల సమ్మె నిరుత్సాహంగా ముగిసింది. ●

హిమ సమాన శైత్య సుఖాన్నీ,
నందివర్ధనాల ధావళ్యాన్నీ మీకు అందించేది
మమతా స్నో.......
పార్క్ కెమికల్స్ కలకత్తా-1 ఉత్పత్తి
సోల్ సెల్లింగ్ ఏజంట్లు :
టి. వి. సుబ్బారావు & సన్స్, ఫోన్ : 4046, విజయవాడ —1



Svad-29